సీఎం జగన్‌తోనే అభివృద్ధి



ఆమదాలవలస రూరల్: బెలమాంలో స్పీకర్ తమ్మినేని సీతారాంకు హారతి ఇస్తున్న మహిళలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- ఎన్నికల ప్రచారానికి అనూహ్య స్పందన



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో ఓటు వేయాలని వృద్ధురాలిని కోరుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సరుబుజ్జిలి: అభివృద్ధికి కేరాఫ్‌గా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. మండలంలోని మూలసవలాపురం, తురకపేట, తురకపేట కాలనీ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సిరిపల్లి శ్రీనివాసరావు, గదిలి రమణమూర్తి, మీసాల మురళి, భాస్కరరావు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, కొత్తకోట పీఏసీఎస్ అధ్యక్షుడు కొవిలాపు చంద్రశేఖర్, పున్నపురెడ్డి తవిటనాయుడు, ఎడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం..

ఆమదాలవలస రూరల్: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో బెలమాం, లొద్దలపేట గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందించిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బెండి గాంధీ, పూజారి కాంతారావు, కణుగుల కిశోర్, పంచాది పాపారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

ఎల్.ఎన్.పేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంతో పాటు పెద్దకోట, లక్ష్మీనర్సుపేట గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ నాయకులు రెడ్డి రామారావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, కొల్ల కృష్ణ, ముగడ దివాకర్, తొత్తడి మురళీకృష్ణ, లోచర్ల మల్లేశ్వరరావు, శిమ్మ సాంబశివరావు, కింతలి చిరంజీవి, రెడ్డి సీతారాం, ఈగల చిన్నారావు, ముగడ జనార్దన, లుకలాపు సుధీర్, కెల్ల గణపతి, బలగ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

బూర్జ: మండలంలోని పెదలంకాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాంను, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, స్థానిక సర్పంచ్ కాగితాపల్లి గోవిందరావు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి:మూలసవలాపురంలో ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



బూర్జ: పెదలంకాంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చిరంజీవినాగ్

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తోన్న కృష్ణచైతన్య

జలుమూరు: మండలంలోని కరకవలస, మర్రివలస, వెంకటాపురం గ్రామాలకు చెందిన 20 టీడీపీ కుటుంబాలవారు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.చిన్నారావు, పాపారావు, మోహన్‌రావు, కల్లేపల్లి కృష్ణ, కరజాడ నారాయణరావు, బి.మల్లేశ్వరరావుతోపాటు పలువురు ఉన్నారు. ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, బి.గోవిందరావు, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



పొందూరు: లోలుగులో రాజీనామా లేఖలను అందజేస్తున్న వలంటీర్లు



నరసన్నపేట: దేశవానిపేటలో రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

పొందూరు: మండలంలోని పొందూరు, లోలుగు, తాడివలస, గోకర్నపల్లి, దళ్లవలస, గోరింట, పెనుబర్తి, కొంచాడ తదితర గ్రామాల్లోని 200 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. లోలుగులో 30 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి ప్రియదర్శినికి అందించారు.

55 మంది..

నరసన్నపేట: మండలంలో 55 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. నరసన్నపేట సచివాలయం-4 లో ఉన్న 31 మంది, చిక్కాలవలస సచివాలయం పరిధిలో వలంటీర్లు 17 మంది, యారబాడు సచివాలయం పరిధిలోని ఏడుగురు సోమవారం రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు, ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మండలంలో ఇప్పటివరకు 100 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.

సీఎం జగన్ వెంటే మేమంతా..

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఆరుగురు, పెద్దలక్ష్మీపురం సచివాలయ పరిధిలోని ఎనిమిది మంది గ్రామ వలంటీర్లు సోమవారం వారి విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను విమర్శిస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా టీడీపీ ఎత్తుగడలో భాగంగా గ్రామ వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయనివ్వకుండా అడ్డుకుందన్నారు. ఇబ్బందులకు గురిచేస్తే.. సహించేది లేదని తెలియజేస్తూ.. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, పాతపట్నం ఎమ్మెల్యేగా రెడ్డి శాంతి విజయానికి కృషి చేస్తామన్నారు.



కొత్తూరు: రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు



పోలాకి: రాజీనామా చేస్తున్న చీడివలస వలంటీర్లు

గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో ఆరుగురు..

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీకి చెందిన ఆరుగురు వలంటీర్‌లు తమ విధులకు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. రాజీనామా చేసినవారిలో జి.రాణి, వై.గణేష్, పి.జోత్స్న, బి.గోవిందరావు, వి.గోవిందరావు, టి.రామరాజు ఉన్నారు.

చీడివలసలో..

పోలాకి: మండలంలోని చీడివలస సచివాలయం పరిధిలోని వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా ఎంపీడీఓ ఉషశ్రీకి రాజీనామాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ భైరాగినాయుడును కలిసి రాజీనామాలపై వివరించారు.



నరసన్నపేట: చిక్కాలవలసలో రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు



మెళియాపుట్టి: రాజీనామా పత్రాలను అందజేస్తున్న పెద్దలక్ష్మీపురం వలంటీర్లు

మధుబాబుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

పాతపట్నం: స్థానిక బాలాజీనగర్‌కు చెందిన శాసనపూరి మధుబాబు విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా గోవా కేంబ్రిడ్జి డిజిటల్ యునివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇటీవల గోవా కేంబ్రిడ్జి యూనివర్సిటీలో నిర్వహించిన కాన్వకేషన్‌లో మధుబాబుకు గోవా మాజీ సీఎం కామత్, శ్రీవెంకటేశ్వర ఓపెన్ యూనివర్సిటీ వీసీ లలిత్‌కుమార్, యూరో ఆసియన్ యూనివర్సిటీ వీసీ సెబాస్టియన్ తదతరులు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. మధుబాబు గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలను యువతతో ఏర్పాటు చేయించి, ఒక్కో గ్రంథాలయానికి రూ.10 వేల విలువైన పుస్తకాలు అందించారు. ప్రతీ ఏడాది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి నగదు బహుమతులు అందజేస్తున్నారు. 27 సార్లు రక్తదానం చేయడమేకాక పాతపట్నం పరిసర ప్రాంతాల్లో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మికత కార్యక్రమాలు కూడా నిర్వహించడంతో గౌవర డాక్టరేట్ వచ్చిందని మధుబాబు సోమవారం తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 50 మందికి ఏపీ ఆర్జేసీ, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కేంద్రాన్ని ఎంఈఓ కె.రాంబాబు సోమవారం పరిశీలించారు. ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులు సైతం మెలకువలు నేర్చుకోవాలన్నారు. ప్రత్యేక శిక్షణను ఇస్తున్న హెచ్‌ఎం కేశవరావు, ఉపాధ్యాయుడు క్రాంతిరాజును ఎంఈఓ అభినందించారు.

టిప్పర్ ఢీకొనడంతో యువకుడికి గాయాలు

సారవకోట: మండలంలోని కొత్తూరు రోడ్డుకు సమీపంలో సోమవారం టిప్పర్ ఢీ కొనడంతో కుమ్మరిగుంట గ్రామానికి చెందిన ధర్మాన రవి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన కథనం మేరకు.. కొత్తూరు రోడ్డుకు సమీపంలో జాతీయ రహదారికి పక్కన బైక్ నిలిపి ఫోన్‌లో మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ అతడిని అమాంతం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా పాతపట్నంకు చెందిన 108 వాహనంలో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. ట్రిప్పర్ ఢీ కొనడంతో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. ట్రిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్షంగా చూసిన వారు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు వెళ్లి పరిశీలించారు.

పంచాంగ శ్రవణం

సరుబుజ్జిలి: మండలంలోని సుభద్రాపురంలో వేదపండితులు మావుడూరి కృష్ణారావు ఆధ్వర్యంలో ఉగాది పంచాంగం శ్రవణం సోమవారం నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలకు జాతక రీత్యా మిశ్రమ ఫలితాలు ఉంటాయన్నారు. డకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, తెలుగు అధ్యాపకుడు శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే..

లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పక్కన ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

- ఈ ఎన్నికలతో టీడీపీని భూస్థాపితం చేద్దాం
- 8 స్థానాల్లో గెలిచి జగనన్నకు కానుక ఇద్దాం
- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



హాజరైన నాయకులు, కార్యకర్తలు

నరసన్నపేట: జిల్లా ప్రజలందరూ నరసన్నపేట వైపే చూస్తున్నారని, మనం ఇక్కడ గెలిచి చరిత్ర సృష్టించాలని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకి రోడ్డులోని కల్యాణ మండపంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు పగటి కలలు కంటున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మన విజయాన్ని అడ్డుకోలేరన్నారు. మరో 40 రోజులు పార్టీ కోసం కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. నరసన్నపేటతో పాటు జిల్లానూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని, ఆయనకు మన జిల్లాలోని 8 ఎమ్మెల్యే స్థానాలు, ఒక ఎంపీ స్థానంలో గెలిచి కానుకగా ఇద్దామన్నారు.

ప్రతి ఓటూ కీలకమే: ధర్మాన రామదాస్

ఈ ఎన్నికల్లో ప్రతిఓటూ కీలకమేనని, ఇప్పటినుంచే ప్రతీ కార్యకర్త గ్రామాల్లో ఓటర్ జాబితాలు సరి చూసికోవాలని పార్టీ నాయకుడు ధర్మాన రామదాస్ అన్నారు. ప్రతీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమాన్ని వివరించాలన్నారు.

అండగా ఉంటాం: కృష్ణచైతన్య

ఈ 40 రోజులు కార్యకర్తలు, నాయకులు చేపట్టాల్సిన కార్యక్రమాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య వివరించారు. మీకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ నాయకులు చింతు రామారావు, గుప్త, సదాశివుని కృష్ణ, రాజాపు అప్పన్న, సాయి ప్రసాద్, లుకలాపు రవి, కణిత సత్తిబాబు తదితరులు ప్రసంగించారు. రెండు మండలాలకు చెందిన ప్రధాన నాయకులందరూ పాల్గొన్నారు.

ఎంపీ స్థానం గెలిస్తే టీడీపీ పని ఖతం: పేరాడ తిలక్

శ్రీకాకుళం ఎంపీ స్థానం విజయంపై సీఎం జగన్ ఎంతో ఆసక్తిగా ఉన్నారని, ఈసారి ఇక్కడ ఎంపీగా వైఎస్సార్‌సీపీ గెలిస్తే జిల్లాలో టీడీపీ పని భూస్థాపితం అవుతుందని ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్ అన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. నరసన్నపేటలో ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్ విజయం చాలా అవసరమన్నారు.

359 మందికి వైద్య సేవలు

నరసన్నపేట: మాకివలస పీహెచ్‌సీ పరిధిలోని నరసన్నపేట-1 సచివాలయంలో సోమవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 359 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, మాకివలస పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష, పంచాయతీ ఈఓ సవర చిన్నారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు కూడలి వద్ద స్థానిక ఎస్‌ఐ ఎం.ఎ.అహమ్మద్ తన సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని ఆర్.కె.పురం గ్రామానికి చెందిన కోరాడ షణ్ముఖరావు ద్విచక్ర వాహనంపై 12 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్యం, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. షణ్ముఖరావుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.